ఆలోచనలు, బలహీనతలు ఎలా పోతాయో గురువు శిష్యుడికి బోధిస్తున్నాడు. ఆ బోధ అంతా విని వెళ్ళి గురువును ముట్టుకొన్నాడు. నిన్ను ముట్టుకొన్నాక అన్నీ పోయినాయి ఇంక సాధన ఎందుకు అన్నాడు. నిప్పు మీద మిడతలు పడ్డాక ఆ మిడతలు బతుకుతాయా? నిన్ను ముట్టుకొన్నాక నాకు పాపాలు ఏమిటి అన్నాడు అంటే పరిపూర్ణమైన విశ్వాసం. మీరు శ్వాస మీద ఆధారపడి బతకకండి, విశ్వాసం మీద ఆధారపడి బతకండి అన్నారు గాంధీగారు. శ్వాస ఇవాళ ఉంది రేపు పోవచ్చు కాని విశ్వాసం అలాకాదు, అది రాబోయే జన్మకు కూడా వస్తుంది.

ఓ అరుణాచలేశ్వరుడా! భౌతికమైన ప్రేమలలో తల్లి ప్రేమ గొప్పదికాని నీ ప్రేమ ముందు తల్లి ప్రేమకూడా సరిపోదు, నీ ప్రేమ ముందు తల్లి ప్రేమ కూడా ఒక ప్రేమా! అంటే గురువు యొక్క దయ ఒక్కసారి మనకు కలిగితే మన జీవితాన్ని ఎలా నడిపించాలి, ఎప్పుడు మన జీవితాన్ని మలుపు తిప్పాలి, ఎప్పుడు మనకు మోక్షాన్ని ప్రసాదించాలి అంతా ఆయనే చూసుకొంటాడు. మన చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా, సహనంతో, ప్రేమతో చేస్తూ ఉంటే ఆయన చేతిలో ఉన్న పని గురించి మనం జ్ఞాపకం చేయనక్కరలేదు, ఎప్పుడు ఎక్కడ ఎలా చేయాలో ఆయనే నిర్ణయించుకొంటాడు, వాడే ఈశ్వరుడు. సూర్యుడు ఉదయిస్తేనే గాని చీకటి బయటకు పోదు. అలాగే ఈశ్వరానుగ్రహం లేకుండా మనలో ఉన్న అజ్ఞానం బయటకు పోదు. మీకు బాహ్యపరిస్థితులు అన్నీ బాగున్నా గర్వం తెచ్చుకోవద్దు. గర్వం ఎప్పుడైతే వచ్చిందో పతనం ప్రారంభమవుతుంది. మీ కళ్ళలో దోషం వస్తే గుడ్డితనం ప్రారంభమవుతుంది, మనస్సులో మమకారం పెరుగుతూ ఉంటే మనస్సుకు గుడ్డితనం పెరుగుతుంది. నా మాటయందు నీకు గౌరవం ఉంటే, నా ఇష్టాన్ని నీ ఇష్టంగా చేసుకొంటే, నా నామాన్ని స్మరిస్తూ ఉంటే, నన్ను ధ్యానిస్తూ ఉంటే ఎటువంటి బుద్ధిని నీకు ఇస్తే మోక్షం కలుగుతుందో అటువంటి బుద్ధిని నాచేతితో నీకు ప్రసాదిస్తాను, నీ పాడుబుద్ధిని తీసేసి సద్బుద్ధిని, సహృదయాన్ని కలుగజేసే బాధ్యత నాది అంటున్నాడు పరమాత్మ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 19-04-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏకాంతవాసం, సహవాసం, ఉపవాసం ఇవన్నీ మంచివే. ఉపవాసం శరీర ఆరోగ్యానికి, సహవాసం మానసికఆరోగ్యానికి, ఏకాంతవాసం మన మనస్సులో ఏముందో మనం తెలుసుకోవటానికి సహకరిస్తాయి. మనకు కోరికలు లేకపోతే ఏకాంతంగా ఉండగలము. ఏకాంతవాసంలో మనం భగవంతుడిని ఉపాసించటం వలన ఏకాగ్రత పెరుగుతుంది. మీరు సబ్జక్టు అర్థం చేసుకొంటే ఈ జన్మలోనే తరించగలరు, సబ్జక్టు అర్థం చేసుకోకుండా సాధన

చేసినా ప్రయోజనం ఉండదు. అసలు 10% సాధన, మిగతా 90% అండర్‌స్టాండింగ్‌లోనే రావాలి. సత్వగుణం పెంచుకోవటానికి ప్రయత్నం చేయాలి. సత్వగుణం లేకుండా ఆత్మజ్ఞానం రాదు. సాపేక్షకజ్ఞానం వేరు, ఆత్మజ్ఞానం వేరు. సాపేక్షకజ్ఞానం అంటే మనస్సుతో సంపాదించేది. సాపేక్షకజ్ఞానం వలన శరీరయాత్ర నడుస్తుంది కాని మోక్షం రాదు. ఎక్కడైతే మనస్సి అణిగుతుందో అక్కడ నుండి ఆత్మజ్ఞానం కలుగుతుంది, ఆత్మజ్ఞానం వలన మోక్షం వస్తుంది. ఆత్మజ్ఞానం వలన పునర్జన్మలేని స్థితిని పొందుతాము. సాపేక్ష జ్ఞానం అంటే నేర్చుకొనే వాడు ఒకడు ఉండాలి, నేర్చుకోవటం అనేది ఒక పని, ఆ నేర్చుకొనే సబ్జక్టు అక్కడ మూడు వస్తున్నాయి. దీనివలన కూడా ప్రయోజనం ఉంది. ప్రపంచంలో ఎవరితో ఎలా మాట్లాడాలి, ఎవరితో ఎలా మెలగాలి అనేది తెలుస్తుంది. అందరికి శరీరం ఉంది కదా, శరీరం ఉన్నంతసేపు ఏదో ఒకటి తినాలి, దానికి నీడ ఉండాలి, బట్ట ఉండాలి. కొంత సాపేక్ష జ్ఞానం లేకుండా పొట్టగడవదు, బట్ట, నీడ ఉండవు. కాని మన శరీరం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో సాపేక్ష జ్ఞానం కూడా అంతే నిజం. ఆత్మజ్ఞానం దేహంతో, లోకంతో సంబంధం లేనిది, అది మోక్షాన్ని ఇస్తుంది. ఆత్మజ్ఞానం కలిగితే నువ్వు ఇతరులతో సంబంధం లేకుండా స్వతంత్రమైన సుఖంలో, ఆనందంలో, శాంతిలో ఊగిసలాడతావు. అసలు పూర్వజన్మలు లేవు, రాబోయేజన్మలు లేవు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. ఈ జన్మలు కూడా స్వప్నంతో సమానము అన్న సంగతి నీకు ఆత్మజ్ఞానం వలన అనుభవంలోనికి వస్తుంది. ప్రతీ మనిషికి తన అనుభవం తనకు వచ్చేవరకు ఏదో సందేహం, ఏదో అనుమానం, ఏదో పీడ వెంటాడుతూ ఉంటుంది. ఉన్నది ఏదో ఉంది, అది అన్నికాలాలలో ఉంది, అంతటా ఉంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు ఎరుకలోనికి వస్తే, ఈ జన్మలు అంతా అసత్యం అని అప్పుడు నీకు అనుభవంలోనికి వస్తుంది. అప్పుడు మీరు ఇతరులు చెప్పే మాటలమీదగాని, శాస్త్రం మీదగాని ఆధారపడనక్కరలేదు.

లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి, ఏ ఆకర్షణకు మనం లోబడినా మనస్సుకి అంతర్‌దృష్టి కలుగదు. అంతర్‌దృష్టి లేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మనిషి ఒకే టైములో దేవుడిని, డబ్బుని ఆరాధించలేడు. దేవుడిని ఆరాధించే వాడు డబ్బును ఆరాధించలేడు, డబ్బును ఆరాధించేవాడు దేవుడిని ఆరాధించలేడు. నీ హృదయంలో ధనానికాస్థానం, దేవుడికాస్థానం, నీవు ఏమి కోరుకొంటున్నావో చూసుకో. త్యాగరాజు భక్తుడు అని తెలిసి ఒక రాజుగారు కొంతధనం, బంగారం పంపాడు. పంపిన ధనాన్ని, బంగారాన్ని ఎదురుగుండా పెట్టుకొని రామా! ఓ శ్రీరామా! ఈ నిధి సుఖమా, నీ సెన్నిధి సుఖమా అంటాడు. నీకు బంగారం కావాలంటే ఎదురుగా ఉంది తీసుకో, నీకు రాముడి సన్నిధి కావాలంటే ఈ బంగారాన్ని వదిలెయ్యి,

నీకు ఏది కావాలంటే అది తీసుకో అని తన మనస్సుతో తానే చెప్పకొంటున్నాడు. నిధిలో ఏమీ లేదు, ఇది అంతా మాయ, ఆయన సన్నిధే సుఖం అని లోపల నుండి సందేశం వచ్చింది, ఈ సంఘటన తరువాత ధనం, బంగారాన్ని పంపేసాడు. అప్పటివరకు త్యాగరాజు, ఆయన అన్నగారు స్నేహంగా ఉండేవారు, ఇప్పడు పేచీలు ప్రారంభమైనాయి. వాడికి అక్కర లేకపోతే ఆ ధనం, బంగారం నాకు ఇవ్వవచ్చు కదా అని అప్పటి నుండి పేచీలు ప్రారంభమైనాయి, ఈ బంగారం పేచీలకు దారితీసింది. రామకృష్ణపరమహంస శరీరం విడిచిపెట్టాక శారదామాత పుట్టింటికి వెళ్ళిపోయారు. పూర్వపు భక్తులు శారదామాతకు పళ్ళు తెచ్చి ఇస్తూ ఉండేవారు. శారదామాతకు అయిదుగురు తమ్ముళ్ళు ఉండేవారు. నాకు తెచ్చిన పళ్ళు అన్నీ నేను ఏమి చేసుకొంటాను అని ఇంటిదగ్గర ఇచ్చేసేవారు, ఆ పళ్ళుకోసం మరదళ్ళు రోజూ పేచీలు పెట్టుకొనే వారు అని శారదామాత చెప్పారు. ఇంతాచేస్తే తినే పళ్ళకోసం, మాయ అంటే ఇలా ఉంటుంది.

సముద్రంలో నీరు ఉప్పగా ఉంటుంది, అది ఎంత తాగినా దాహం తీరదు, దాహం పెరుగుతూ ఉంటుంది. ధన కాంక్ష, కీర్తి కాంక్ష, సముద్రంలో నీరు వంటివి అని మిల్టన్ చెప్పాడు. మీరు కీర్తి సంపాదించే కొలది కీర్తి కాంక్ష, ధనం సంపాదించే కొలది ధనకాంక్ష పెరుగుతూ ఉంటాయి. బయట ఏదో ఉంది, ఏదో ఉంది అని మనం అనుకోవటం వలన మనస్సు బయటకు వచ్చేస్తుంది. బాహ్యాఆకర్షణల వలన మనస్సును లోపలకు పంపలేక పోతున్నాము. ఏసుక్రీస్తు దగ్గరకు 30 సం॥లు వయస్సు ఉన్నవాడు ఒకడు వచ్చాడు, ఎమోషన్‌లో ఉన్నాడు. నాకు ఏమీ అక్కరలేదు, నువ్వే చాలు ప్రభువా అంటున్నాడు. నువ్వే నాకు దిక్కు, నన్ను రక్షించడానికి నువ్వు చాలు అంటున్నాడు. ఆ మాటలు నిజం కాదు, ఆ వైరాగ్యం నిజం కాదు అని ప్రభువుకు తెలుసు. అతనికి ఆస్తి ఉందని ఏసుక్రీస్తుకు తెలుసు. నీ ఆస్తిని అమ్మేసి ఆ డబ్బు నా దగ్గరకు తీసుకొని రానక్కరలేదు. మీ గ్రామంలో ఉన్న పేదలకు పంచిపెట్టేసి అప్పడు నువ్వు నా దగ్గరకు రా, నన్ను అనుసరించు అని చెప్పాను, వాడు తిరిగి నాకు కనబడలేదు అని ఏసుక్రీస్తు అన్నారు. డబ్బు ఉందని మీరు అవసరం లేని ఖర్చులు పెంచుకొన్నారు అనుకోండి, డబ్బు ఉన్నవాళ్ళకింద కనబడాలని ఖర్చులు పెడుతున్నారు అనుకోండి మీరు పేదవారు అయిపోతారు. కొంతమంది ఎలా ఉంటారు అంటే నాలుగు వస్తువులు అవసరమైతే ఒక్క వస్తువుతో కాలక్షేపం చేస్తారు, ఖర్చుల దగ్గర బహుజాగ్రత్తగా ఉంటారు, వారు పేదవారికింద మనకు కనబడుతూ ఉన్నా ధనవంతులు అయిపోతారు. మీకు నిజంగా ధనం ఉన్నా లగ్జరీస్ పెంచుకోవద్దు. కొంతమంది వారి అవసరాలకు ఎంత డబ్బు అయినా ఖర్చు పెట్టుకొంటారు కాని పక్కవారికి ఒక్కపైసా ఖర్చుపెట్టరు. అది పాపాన్ని

తీసుకొని వస్తుంది. వారికి ఉన్న కోరికను సంతృప్తి పరచుకోవటం కోసం ఖర్చు పెట్టటం లేదు, అక్కడ అవసరం ఏమిటో తెలుసుకొని దయ చూపించు, అక్కడ ఖర్చుపెట్టు, అది పుణ్యాన్ని తీసుకొని వస్తుంది. మీరు శివాలయానికి వెళ్ళి శివుడిని పూజించవచ్చు, విష్ణు ఆలయానికి వెళ్ళి విష్ణువును పూజించవచ్చు, చర్చికి వెళ్ళి క్రీస్తును పూజంచవచ్చు, ఎవరికి ఇష్టమైన దేవుడిని వారు పూజించుకోవచ్చు, భక్తులు అంటే కేవలం అది కాదు, అందరి హృదయాలలో నివాసంగా ఉన్న ఈశ్వరుడిని ఎవడైతే దర్శించగలుగుతున్నాడో, వాడే నిజమైన భక్తుడు. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారు సహృదయంతోటి, సద్బుద్ధితోటి ఒక మంచి పని కూడా చేయరు, కాని వారు గొప్పవారు అని లోకం అనుకోవాలి, ఇవి అన్నీ పిచ్చి చేష్టలు.

నాకు పునర్జన్మ వస్తుందా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. లోపల అజ్ఞానం ఉన్నప్పుడు పునర్జన్మ వస్తుంది. మనం కాని దానిని మనం అనుకోవటమే అజ్ఞానం. మీకు దేహం వచ్చిందా మీరు బంగారంతో కట్టిన ఇంట్లో ఉన్నప్పటికీ దుఃఖం మిమ్మల్ని వెంటాడుతుంది, ఎవరూ దుఃఖంలో నుండి తప్పించుకోలేరు. జ్ఞానం వలన దుఃఖం నశిస్తుంది కాని ధనం వలన దుఃఖం నశించదు. మీ ఇంటికి దొంగలు వచ్చారు అనుకోండి, మీ ఇంట్లో ఉన్న వస్తువులను పట్టుకొనిపోతారు, అలాగే మీ ఇంట్లో ఉన్న దుఃఖాన్ని, మీ మనస్సులో ఉన్న దుఃఖాన్ని తీసుకొనిపోయేవాడు గురువు. ఏదో కార్యక్రమం గురించి చెపుతూ నేను దానికి రెండు లక్షల రూపాయలు ఇచ్చాను అని చెప్పారు. మీరు బాగా ఇచ్చారు అంత ఇస్తారనుకోలేదు అని నేను అన్నాను. ఆ కళ్యాణమండపానికి నా పేరు పెట్టండి అని ముందే మాట్లాడుకొని ఇచ్చాను అని చెప్పారు. నీ పేరు నువ్వు మర్చిపోలేవు, నీ రూపాన్ని, నీ గౌరవాన్ని నీవు మర్చిపోలేవు ఇంక నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? చివరకు మిగిలేది గోడల మీద పేర్లు, అసలు సున్న. నువ్వు ఎన్ని గ్రంథాలు చదివినా, నీకు ఎంత పాండిత్యం ఉన్నా, నీవు ఎంత సాధన చేసినప్పటికీ రూపబుద్ధి, నామబుద్ధి నశించనంతవరకు నీకు ఆత్మజ్ఞానం కలుగదు. నేను జిన్నూరులో ఉన్నప్పుడు పాలకొల్లులో లేను అనుకొంటాడు, పాలకొల్లులో ఉన్నప్పుడు జిన్నూరులో లేను అనుకొంటాడు, ఎక్కడైతే దేహం ఉందో అక్కడే ఉన్నాను అనుకొంటాడు. ఆ దేహబుద్ధి ఉన్నంతకాలం ఈ శవం చనిపోయినా ఇంకో శవం వస్తుంది. చనిపోయేవాడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. చనిపోతున్నాను అనుకొంటున్నాడు కాబట్టి వాడు పుడతాడు. పుట్టినవాడు నేను పుట్టాను, నేను పుట్టాను అనుకొంటున్నాడు, నేను పుట్టాను అనుకొంటున్నాడు కాబట్టి వాడు పుడతాడు. పుట్టినవాడు నేను పుట్టాను, నేను పుట్టాను అనుకొంటున్నాడు,

నేను పుట్టాను అనుకొంటున్నాడు కాబట్టి, ఆ పుట్టిన వాడు చనిపోతాడు. బ్రహ్మం నేను పుట్టాను అనుకోదు, నేను చనిపోతున్నాను అనుకోదు, అది జననమరణాలకు అతీతం. చైతన్యం మూడు అవస్థలలోను ఉంది, అది సరళంగా ఉంది, సహజంగా ఉంది, అదే మనం అయి ఉన్నాము. అహంకారం గాఢనిద్రలో లేదు. అహంకారంతో సంబంధం లేకుండా గాఢ నిద్రలో ఉన్నావు. జాగ్రదవస్థలోనికి రాగానే అహంకారం వచ్చి ఒక దేహంతోటి, ఒక కులంతోటి, ఒక దేశంతోటి, రంగుతోటి ఇలా దేనితో ఒకదానితో తాదాత్మ్యం పొందుతూ ఉంటుంది, ఆ తాదాత్మ్యం పొందేదానికే పునర్జన్మలు వస్తాయి. గాఢనిద్రలో అహంకారం లేకుండా ఏదైతే ఉందో దానికి పునర్జన్మలు లేవు.

మేము కష్టాలు పడుతున్నాము, మాకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి ఇలా అనుకోవటం అంతా అహంకారమే. దీనికి అసలు సత్యానికి ఏమీ సంబంధం లేదు. దేహగతమైన చరిత్ర వల్లకాటితో ఆగిపోతుంది, జీవుడు ఆగడు, వాడు ప్రయాణం చేసి ఇతర లోకాలకు వెళ్ళిపోతాడు, అక్కడ కర్మానుభవం అయ్యాక మరల శరీరం ధరించి వస్తాడు. ఇది బుద్ధుడిని అడిగితే శరీరం చనిపోయిన తరువాత ఎవడైతే ప్రయాణం చేసి వెళుతున్నాడని అనుకొంటున్నారో వాడు ఇప్పుడు కూడా లేడు, నువ్వు విచారణ చేసి వాడు లేడన్న సంగతి తెలుసుకొంటే నిర్వాణసుఖాన్ని పొందుతావు, అప్పుడు ఇంక శవాలను మోయవలసిన పనిలేదు. కిరసనాయిలు దీపాన్ని మనం ప్రత్యేకంగా ఆర్పనక్కరలేదు, లోపల కిరసనాయిలు అయిపోతే అదే ఆరిపోతుంది అలాగే మన లోపల ఉన్న జీవలక్షణాలు అన్నీ పోతే ఆ జీవుడు నశిస్తాడు, లోపల ఉన్న బ్రహ్మం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. నేను పుట్టకముందు ఎక్కడ ఉన్నాను అని ఎవరు అడగరు, నేను చనిపోయిన తరువాత ఎక్కడకు వెళతాను అని అడుగుతారు, కారణం ఏమిటి? దేహము నేను అనుకొంటాడు, దేహం లేనప్పుడు నేను లేను అనుకొంటున్నాడు. అందుచేత దేహం పోయిన తరువాత ఎక్కడికి వెళతాను అని అడుగుతున్నాడు. దేహము లేనప్పుడు కూడా వాడు ఉన్నాడు అన్న సంగతి తెలియక నేను ఎక్కడనుండి వచ్చాను అని వాడు అడగడు, ఎక్కడికి వెళతాను అని అడుగుతాడు అంటే వాడి అస్థిత్వాన్ని దేహానికి పరిమితం చేసుకొంటున్నాడు. గాఢనిద్రలో నుండి మెలుకువ రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది, తరువాత ఇతర తలంపులు వస్తాయి. ఏ తలంపు వచ్చాక అన్నీ వస్తున్నాయో ఆ తలంపు నశించే వరకూ నిన్ను పునర్జన్మలు, స్వర్గలోకాలు, కర్మ సిద్ధాంతం అన్నీ వెంటాడతాయి. భగవంతుడికంటే మనం వేరుగా ఉన్నాము, మనం ఏదో సాధించేసాము అనుకోవటం వలననే అజ్ఞానం పెరుగుతుంది. భగవంతుడు ఇస్తే మనకు వచ్చింది అని తెలియక మనం ఏదో సంపాదించేసాము అనుకొంటాము, దాని వలన

అజ్ఞానం పెరుగుతుంది. మీరు ఏదో కష్టపడ్డారు, సంపాదించామని అనుకొంటున్నారు. మీకంటే వందరెట్లు కష్టపడ్డవారు ఉన్నారు కదా మరి వారు ఎందుకు ధనవంతులు అవ్వలేదు. మీకు ఏది వచ్చినా అది ఈశ్వరుడి ఆజ్ఞను బట్టే వస్తుంది కాని లేకపోతే అది రాదు. సత్యం తాలుక అనుభవం నీకు లేకపోవటం వలన ఏదో వచ్చేసింది, జన్మలు వచ్చేస్తున్నాయి అనుకొంటున్నారు, ఈ జీవుడు ఎంత నిజమో జన్మలు కూడా అంతే నిజం, ఇవన్నీ వ్యవహారిక సత్యాలు మాత్రమే.

నీ హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటం మానివేసి రాబోయే జన్మలు ఎటువంటివి వస్తాయి, ఏ లోకానికి వెడతాము అని తెలుసుకొన్నా ప్రయోజనం లేదు, ఇది అంతా అజ్ఞానమే. నువ్వు కాని ఈ శరీరంలో నుండి, నువ్వుకాని ఈ మనస్సులో నుండి, నువ్వు కాని ఈ జన్మలలో నుండి, బంధంలో నుండి విడుదలపొందాలంటే నీ హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవాలి, దానిని తెలుసుకొనే వరకు నువ్వుకాని దానిలోనుండి నీవు విడుదల పొందలేవు, అప్పటివరకు నీకు స్వేచ్ఛ లేదు, సుఖంలేదు, శాంతి లేదు. మనిషిని నీడ ఏవిధంగా అయితే వెంటాడుతుందో అలాగే దేహగతమైన నేనుతో తాదాత్మ్యం పొందుతున్నంతకాలం అది కల్పించిన గొడవలు అన్నీ నిన్ను వెంటాడుతాయి. కొంతమంది జరిగిపోయిన గొడవలు అన్నీ తలపెట్టుకొంటూ దుఃఖపడుతూ ఉంటారు, వర్తమానకాలాన్ని వదిలేస్తారు. గతానికి సంబంధించిన బరువు మోయటం కంటే రోడ్డు రోలరును మొయ్యటం మంచిది. గతాన్ని స్మరించుకోవటం వలన మీకు కలిసివచ్చేది ఏమీలేదు. వర్తమానకాలాన్ని సద్వినియోగం చేసుకోండి, ఆత్మజ్ఞానం సముపార్జించండి. కష్టపడి పనిచేసుకొనే వాడికి గతం గుర్తుకురాదు, సోమరితనానికి అలవాటుపడినవాడికే గతం గుర్తుకు వస్తుంది. నిన్ను నీవు పొగుడుకోవద్దు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మనలను మనం పొగుడుకొంటే మిధ్యానేను పెరిగిపోతుంది. నీకు మంచితనం ఉంటే, నీకు వివేకం ఉంటే సరిపోదు, నీవు వాటిని సద్వినియోగం చేసుకోవాలి. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకోవాలి. దేహభావన అంత తొందరగా నశించదు. అటు తోలితే ఇటువస్తుంది, ఇటు తోలితే అటు వస్తుంది. అందుచేత బహుకాలం నుండి వస్తున్న వాసనలను తొలగించుకోవాలంటే, నీవు బహుకాలం సాధన చేస్తేగాని అవి నశించవు.

ప్రతీ మనిషికి దుఃఖం వస్తోంది, నా దుఃఖానికి మా అత్తగారు కారణం, మావగారు కారణం, ఎవరో ఇతరులు కారణం అనుకొంటున్నాము. నీ దుఃఖానికి ఇతరులు కారణం అని తెలుసుకోవటానికి జ్ఞానం అక్కరలేదు, నీ దుఃఖానికి నీవే కారణం అని తెలుసుకోవటానికి జ్ఞానం అవసరం. దుఃఖం అనేది దేహభావన రూపంలో ఉంది. అహంభావన లేకుండా

దేహభావన రాదు. గాఢనిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి రాగానే మొదట అహంభావన వస్తుంది, అహంభావన వచ్చిన వెంటనే దేహభావన వస్తుంది, ఏ భావన వచ్చిన తరువాత ఇతర భావనలు వస్తున్నాయో ఆ భావన తొలగేవరకూ, ఆ భావన వేరుతో సహా నశించే వరకు నీకు పునర్జన్మలు వస్తూనే ఉంటాయి, దుఃఖం వెంటాడుతుంది. దేహం వచ్చిందంటే దుఃఖం వస్తుంది. బ్రహ్మంను తెలుసుకోవాలి అని నూటికి నూరుపాళ్ళు మన మనస్సు దాని మీద నిలబడుతూ ఉంటే, దాని మీద తప్ప మన మనస్సు ఎక్కడా వాలకుండా ఉంటే వాడికి బ్రహ్మం ఎరుకలోనికి వస్తుంది. నాకు ప్రపంచంలో గొప్పలు కావాలి, అంతస్థులు కావాలి, గౌరవాలు కావాలి, దేవుడిని పట్టుకోవాలి అంటే ఎలా కుదురుతుంది. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే ఈశ్వరుడు తెలియబడడు.

నీ మనస్సుతోటి ఏదీ ఊహించుకోవద్దు, కల్పించుకోవద్దు, నీవు కల్పించుకొనేది, ఊహించుకొనేది అంతా మాయే. ఈశ్వరుడి సంకల్పాన్ని బట్టి జరుగుతుంది కాని మీ ఊహలను బట్టి ఏదీ జరగదు. మనందరం తెగిపోయిన గాలి పటాలలాగ లేము, మన దారం ఈశ్వరుడి చేతిలో ఉంది. ఆడించేవాడు ఆయన, ఆడేవారం మనం. ఈ సృష్టి అంతా ఏ హృదయంలో నుండి అయితే వచ్చిందో మనం కూడా అక్కడ నుండే వచ్చాము. తిరిగి అక్కడకు వెళితేగాని హృదయంలో ఉన్న నిజం మనకు తెలియదు. నువ్వు అనుకొన్నది నిజం కాదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది, అది నీకు ఎరుకలోనికి వచ్చేవరకు నిన్ను దుఃఖం వెంటాడుతుంది, అశాంతి వెంటాడుతుంది, పునర్జన్మలు వెంటాడతాయి. మనం తలుపులు వేసుకొని గదిలో నిద్రపోతాము. మన మనస్సు ఎక్కడో విమానాలలో తిరుగుతుంది, కువైట్ వెళ్ళిపోతుంది, నీ శరీరం కువైట్ వెళ్ళలేదు గాని ఈ విమానాలు మనస్సే కల్పించింది, కువైట్ మనస్సే కల్పించింది, స్వప్నం కూడా మనస్సుకే, మీరు గడపదాటి బయటకు వెళ్ళలేదు, ప్రయాణం మనస్సులో చేసారు. అలాగే గతించిన జన్మలు, రాబోయే జన్మలు కూడా నీ మనస్సులో కల్పించబడుతున్నాయి గాని నిజంగా లేవు. ఈ మనస్సు కనుక చిరిగిపోతే ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది, అదే మోక్షం. ఆత్మానందం పొందటానికి నీ శరీరం చనిపోయే దాక ఆగనక్కరలేదు. సబ్జక్టు అర్థం చేసుకొంటే ఇప్పడే ఇక్కడే కాలు కదపకుండా, చేతులు కదపకుండా వస్తువు నీకు ఎరుకలోనికి వస్తుంది. నిన్ను నీవు తెలుసుకోవటమే జ్ఞానం, నిన్ను నీవు తెలుసుకోకుండా ఎన్ని తెలుసుకొన్నా అది జ్ఞానం కాదు, అది అజ్ఞానమే, అజ్ఞానం అని వూరుకోలేదు ఒకటి లేని సున్నలు అని చెప్పారు. మనం ఈ లోకంలోనికి వచ్చిన జాడ తెలియకుండా వెళ్ళిపోతే రూపబుద్ధి తగ్గుతుంది, నామబుద్ధి తగ్గుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 10-09-06 | ఆది | గోడిపాలెం |
| 11-09-06 | సోమ | మాగాం (తూ॥గో॥ జిల్లా) |
| 01-10-06 | ఆది | జిన్నూరు |
| 03-10-06 | మంగళ | నర్సాపురం, తెలగ కళ్యాణ మండపం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# విచక్షణా జ్ఞానం

'విచక్షణా జ్ఞానము' అనగా యుక్తాయుక్త వివేకము పరమాత్మచే కేవలం మానవులకు మాత్రమే ప్రసాదింపబడిన అపూర్వ వరం. పశు, పక్ష్యాదులకు లేని కేవలం మానవులకే ప్రసాదింపబడిన విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించుకొని బంధ, మోహ భ్రాంతి నుండి విడుదలపొంది అమృతత్వాన్ని పొందాలి. చెడు నుండి మంచికి, తప్పు నుండి ఒప్పుకు, అసత్తు నుండి సత్తుకు, అజ్ఞానము నుండి జ్ఞానమునకు, మృత్యువు నుండి అమృతత్త్వము పొందుటకు ఈ విచక్షణా జ్ఞానాన్ని తప్పక ఉపయోగించుకోవాలి. ఒక గీటురాయిలాగ 'విచక్షణా జ్ఞానాన్ని' సంసార సాగరాన్ని దాటుటకు ఉపయోగించు కొననిచో ప్రసాదింప బడిన ఒక అద్భుత అవకాశమును కోల్పోయిన వారమవుతాము. ప్రతి ఒక్కరము పూర్వ జన్మల ప్రారబ్ధ కర్మల ఫలితంగా ఒక దేహం ధరించి భూమి మీదకు వచ్చాము. అట్లే దేహము మరణించినప్పుడు మనము ప్రోగుచేసుకొన్న సంస్కారములు, వాసనలు తప్ప ఏ భౌతిక వస్తువు మరణానంతర జీవితంలో మన కూడా రాదు. అందువల్ల విచక్షణతో కూడిన విచారణతో ఏది ఆత్మ - ఏది అనాత్మ, ఏది యుక్తము - ఏది అయుక్తము, ఏది నిత్యము - ఏది అనిత్యము, ఏది సత్యము - ఏది అసత్యము అని నిరంతరం మననం చేసుకొంటూ వ్యక్తిభావనను త్యజించడం ద్వారా స్వస్థితిలోకి మేల్కోవాలి.

– చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం

# గీతా సందేశం

ఉపనిషత్తుల సారాంశమే గీతా సందేశం. ఆత్మజ్ఞానం అత్యుత్తమమైనది. అయినప్పటికీ కర్మలు ఆచరించకుండా ఈ భూమి మీద ఎవ్వరూ జీవించలేరు. ఎవడు కర్మలో అకర్మను చూస్తాడో, అకర్మలో కర్మను చూస్తాడో అతడే మానవుల్లో శ్రేష్ఠుడు, బుద్ధిమంతుడు, మహాయోగి, సర్వకర్మకర్త అంటాడు గీతాచార్యుడు. "బ్రహ్మజ్ఞానమే ఉత్తమమైనది అని చెపుతున్నావు మరి నన్ను కర్మలను ఆచరించమని ప్రోత్సహిస్తున్నావు ఎందుకు కృష్ణా!" అని అడుగుతాడు అర్జునుడు. అందుకు భగవానుడిలా చెపుతున్నాడు "పార్థా! సాంఖ్యులకు జ్ఞానయోగం, యోగులకు కర్మయోగం అనాదినుండి వస్తున్నవి. ప్రకృతికి వశుడై ప్రతి వ్యక్తి కర్మలు చేస్తూంటాడు. ఎవరు మనస్సుచేత ఇంద్రియాలను నిగ్రహించుకొని, సంగరహితుడై కర్మయోగాన్ని ఆచరిస్తాడో అతడు విశిష్టుడు. నీవు ముక్తుడివి అయినా సరే పరోపకారార్థం కర్మలను చేయవలసిందే. శ్రేష్ఠుడు ఏది ఆచరిస్తాడో, సామాన్యుడు దానిని అనుసరిస్తాడు. మూడు లోకాల్లో నాకు చేయవలసింది కాని, పొందవలసింది కాని ఏమీ లేకపోయినా నేను కర్మలను ఆచరిస్తున్నాను. క్షణకాలమైనా నేను కర్మలు ఆచరించకపోయినట్లైతే లోకులు నశిస్తారు. అందుచేతనే నేను కర్మలు ఆచరిస్తున్నాను. నీవు కూడా కర్మయోగాన్ని అవలంభించు" అన్నాడు.

భగవద్గీత సిద్ధాంత గ్రంథం కాదు. కర్మ, భక్తి, జ్ఞాన, యోగాలను సంయోజనం చేసిన సమన్వయ గ్రంథం. కర్మయోగం అంటే మనకు నచ్చినపని, మనం మెచ్చినపని చేయటం కాదు. భగవంతుని మీద అనన్యభక్తితో, భగవంతుని కోసం, భగవంతుని ఇచ్ఛననుసరించి కర్మలు ఆచరించటం. నిష్కామకర్మయోగం ద్వారా జ్ఞానాన్ని పొంది, కర్మ జ్ఞానాల ద్వారా భగవంతునికి శరణాగతులై, ఆయన చైతన్యంలో తన చైతన్యాన్ని, ఆయన ఇచ్ఛలో తన ఇచ్ఛను ఏకం చేసి ఆ స్థితిలో కర్మచేయమని గీతా సందేశం. గీత కర్మ సన్యాసాన్ని బోధించటం లేదు. వ్యక్తిత్వాన్ని వదులుకొని పరమాత్మతో మమైకం కావాలంటోంది. అట్టి ఆత్మ సమర్పణ భావం అంత తేలికగా అలవడదు. దానికి ఎంతో సాధన కావాలి. ఆత్మ సమర్పణకి కర్మ, జ్ఞానాలు రెండూ సమానంగా ఆధారం కావాలి. ఇదే గీతా సందేశం.

- బొప్పన అరుణాదేవి, హైదరాబాద్